అధ్వానంగా రోడ్లు


కోతకు గురైన అప్పారాయుడుపాలెం- రాంబిల్లి వెళ్లే ప్రధాన రహదారి

- కోతకు గురైన రాజకోడూరు - రాంబిల్లి ప్రధాన రోడ్డు
- రాళ్లు తేలిన అప్పారాయుడుపాలెం- రాంబిల్లి ప్రధాన రహదారి
- ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు
- పంటలను తరలించడానికి రైతుల ఇబ్బందులు
- మరమ్మతులు చేయని కూటమి పాలకులు

రాంబిల్లి (యలమంచిలి): సంక్రాంతి పండగ నాటికి గుంతలు లేని రోడ్లు లేకుండా చూస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పిన మాటలు ఉత్తుత్తిదేనని తేలిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు దాటినా రాంబిల్లి మండలంలో ఎక్కడికక్కడ రాళ్లు తేలిన గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా పంచదార్ల కోనేరు నుంచి రాజకోడూరు గ్రామం మీదుగా వెళ్లే ప్రధాన రహదారి భారీగా కోతకు గురైంది. ఈ రోడ్డుపై రాళ్లు తేలి గోతులమయంగా మారింది. పచ్చని పంట పొలాల మధ్య రాంబిల్లి మండలానికి సునాయాసంగా చేరుకోవడానికి ప్రయాణికులు ఈ రోడ్డును ఎంచుకొని ప్రయాణాలు సాగిస్తుంటారు. నాలుగు కిలోమీటర్ల మేర ఈ రహదారి పూర్తిగా ఛిద్రమైంది. రోడ్డుకు ఇరువైపులా పలు గ్రామాలకు చెందిన పొలాలు ఉన్నాయి. నిత్యం రైతులు పండించిన పంటలను తమ ఇళ్లకు చేర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత కాలంగా ఈ రహదారి గుండా రాంబిల్లి ఎస్ఈజెడ్ పరిశ్రమలకు, నేవల్ బేస్ ప్రాజెక్ట్‌కు వెళ్లే కార్మికులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. రహదారికి మరమ్మతులు కాని కొత్త రోడ్డు కాని నిర్మించాలని వారంతా కోరుతున్నారు.


పంచదార్ల నుంచి రాంబిల్లి వెళ్లే రాజకోడూరు రోడ్డు కోతకు గురైన దృశ్యం

గోతులమయంగా అప్పారాయుడుపాలెం రోడ్డు

అప్పారాయుడుపాలెం నుంచి వెళ్లే రాంబిల్లి ప్రధాన రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భారీ కోతకు గురైనా పాలకులు పట్టించుకోవడం లేదు. పర్యవసానంగా ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాంబిల్లికి వెళ్లే రెండు ప్రధాన రహదారులు కోతకు గురయ్యాయని, వీటిని మరమ్మతులు కాని, కొత్త రోడ్లు కాని వేసి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



పంచదార్ల కోనేరు దగ్గర నుంచి రాజకోడూరు మీదుగా కృష్ణంపాలెం మీదుగా సునాయసంగా తక్కువ సమయంలో రాంబిల్లికి చేరుకోవడానికి రోడ్డు బాగుండేది. ప్రస్తుతం రాజకోడూరు మీదుగా వెళ్లే తారురోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో గుంతలు లేని రోడ్లు అంటున్నారు తప్పా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

– రేబాక రాము, కొత్తూరు గ్రామం

ఛిద్రమైన రోడ్లు



అప్పారాయుడుపాలెం నుంచి రాంబిల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. తరచూ ఈ రోడ్డుపై రాంబిల్లికి యలమంచిలి వెళ్లాలంటే ప్రమాదకరంగా గోతులు దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఈ రహదారితోపాటు రాజకోడూరు మీదుగా వెళ్లే రహదారికి త్వరగా మరమ్మతులు చేయాలి. కొత్త రోడ్డు అయినా వేయాలి.

– శివకోటి ఈశ్వరరావు, హరిపురం కాలనీ

పరిశ్రమలకు వెళ్లాలంటే భయంగా ఉంది



రాజకోడూరు మీదుగా వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ద్విచక్ర వాహనంపై పరిశ్రమలకు డ్యూటీ నిమిత్తం వెళ్లాలంటే భయంగా ఉంది. అప్పారాయుడుపాలెం రోడ్డు పూర్తిగా గోతులమయింగా మారింది. రాంబిల్లికి వెళ్లే రెండు రోడ్లు పూర్తిగా దెబ్బతినడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దేముడు, పరిశ్రమల ఉద్యోగి

సైబర్ మోసాలపై జాగ్రత్త


రాజుపేటలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్

కోటవురట్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రమేష్ కోరారు. రాజుపేటలో సైబర్, ఆన్‌లైన్ మోసాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మైనర్లుకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, ఇందుకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మహిళా పోలీసులు విద్యార్థినులకు ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. బాలికలు ప్రతీ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి అభద్రతా భావం కనిపించినా వెంటనే తల్లిదండ్రులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతమేనా?

అనకాపల్లి టౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల ప్రజలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అవకాశం కల్పిస్తే, కూటమి ప్రభుత్వం 34 శాతం ఇవ్వడానికి క్యాబినేట్‌లో ఆమోదించడం అన్యాయమని ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యుడు బుద్ధ రజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అధిక శాతం బీసీ వర్గాల ప్రజలు జీవిస్తున్నారని, వివిధ నామినేటెడ్ పదవుల్లో స్థానికులకు 65 శాతం కల్పించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలపై అవగాహన


రేబాకలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గుర్తించి వీటి నివారణకు అందరూ సహకరించాలంటూ సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రేబాకలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, మహిళా పోలీస్ తదితరులు గ్రామస్తులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, నమోదయ్యే కేసుల గురించి వివరించారు. జీవో నంబరు 319 ప్రకారం బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా బాల్య వివాహల నివారణకు సహకరిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

పంతాలకు పోయి సమస్యలు సృష్టించుకోవద్దు


అర్జీదారుల సమస్యలు వింటున్న అధికారుల బృందం

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో భాగంగా అర్జీదారుల నుంచి సమస్యలు విన్నారు. ఆమె మాట్లాడుతూ చిన్నచిన్న వివాదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీ చేసుకోవాలన్నారు. పంతాలకు పోయి సమస్యలు సృష్టించుకోవద్దని సలహా ఇచ్చారు. డీటీ శేషుబాబు, ఏఎస్ఐ దొర, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు బాల తులసిమాంబ ఆలయం ప్రారంభం


మడకపాలెంలోని బాల తులసిమాంబ ఆలయం

మునగపాక: మండలంలోని మడకపాలెంలో బాల తులసిమాంబ ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రాయి నాగేశ్వరరావు-నాగమణి దంపతుల ఆర్థిక సాయంతో నిర్మించిన ఆలయంలో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సారె ఊరేగింపు, కోలాటం వంటి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మునగపాకలో ట్రాఫిక్‌కు అంతరాయం


పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద నిలిచిన వాహనాలు

మునగపాక: పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద శుక్రవారం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ రోడ్డుపై ఇరువైపులా భారీ వాహనాలు తప్పించే క్రమంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అసలే ఇరుకు రోడ్డు కావడంతో భారీ వాహనాల రాకపోకలతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. ఉద్యోగాలు, వ్యాపారాలకు వెళ్లే వారు ట్రాఫిక్‌తో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికులే దగ్గరుండి సమస్య పరిష్కారానికి ముందుకు రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాల రాకపోకలు సాగించాయి. దీంతో వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

అధిక లోడు క్వారీ లారీలపై కేసులు

అనకాపల్లి: అధిక లోడుతో ప్రయాణించే క్వారీ లారీలపై కేసులు నమోదు చేస్తున్నామని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలో అధిక లోడుతో వెళ్తున్న రెండు లారీలను పట్టుకుని ఆర్టీవో షేక్ ఆయిషాకు అప్పగించగా, ఆమె రూ.1.24 లక్షల జరిమానా విధించారన్నారు. పరిమితికి మించి లారీలో ఓవర్ లోడ్ వెళ్లడం ద్వారా వాహనాలు పాడైపోవడమే కాకుండా రోడ్లు మరమ్మతులకు గురవుతున్నట్లు చెప్పారు. లారీల నుంచి బండరాళ్లు పడిపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.

విద్యార్థులకు పోటీతత్వం అవసరం

యలమంచిలి సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పోటీతత్వం అలవరచుకోవాలని యలమంచిలి సీఐ ధనుంజయరావు సూచించారు. శుక్రవారం యలమంచిలి పట్టణం కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలైన 10వ తరగతి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా స్పష్టమైన లక్ష్యంతో చదువుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. స్మార్ట్ ఫోన్‌కు అలవాటు పడి చెడుమార్గాన్ని అనుసరిస్తే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. స్మార్ట్ ఫోన్‌కు బానిసలైతే అదే మన మొదటి శత్రువు అవుతుందన్నారు. విద్యార్థులంతా చదువుతో పాటు ఇష్టమైన రంగంలో స్థిరపడడానికి అవసరమైన నైపుణ్యాన్ని నేర్చుకోవాలని, ముఖ్యంగా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. పట్టణ ఎస్సై కే సావిత్రి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి నేరాల బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పోకడలకు దూరంగా ఉండాలని సూచించారు. 20 స్కూళ్ల నుంచి టాలెంట్ టెస్ట్ రాసిన వారిలో ప్రతిభ కనబరిచిన మొదటి 18 మందికి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలతో పాటు వారిలో ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీ పరీక్షలు ఉపయోగపడతాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం బాలాజీ, సీఐటీయూ యలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ అన్నారు. కార్యక్రమంలో కొత్తపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వైవీ రమణ, అమృత ట్యూషన్ సెంటర్ నిర్వాహకురాలు ఎం సుధారాణి, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎం అభి, సీహెచ్ రాము, సీహెచ్ లక్ష్మణ, రాజేష్, శ్రీను, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ ధనుంజయరావు,పట్టణ ఎస్సై సావిత్రి

ఆలయ అభివృద్ధికి సహకరించాలి


శ్లాబ్ పనులు ప్రారంభిస్తున్న పెద్దలు రామజోగినాయుడు,నరసింగరావు

మునగపాక: గౌరీపరమేశ్వరుల ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వాడ్రాపల్లికి చెందిన పెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు కోరారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా శ్లాబ్ పనులను శుక్రవారం వారు ప్రారంభించారు. భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం జరుగుతుందన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి


కోటవురట్లలో కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కోటవురట్ల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలని సీఐటీయూ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నాయకులు ఎస్.సత్యనారాయణ, జి.డేవిడ్‌రాజ్, ఈరెల్లి చిరంజీవి కరపత్రాలను ఆవిష్కరించారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడే విజయగౌరిని అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు. అనంతరం మండలంలోని పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు కరపత్రాలు అందజేశారు.

విశాఖ డెయిరీ అవకతవకలపై విచారణకు డిమాండ్

అనకాపల్లి టౌన్: విశాఖ డెయిరీలో అవకతవకలపై తక్షణమే విచారణ జరిపి నిందితులను శిక్షించాలని ఏపీ పాల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. దొడ్డి రామునాయుడు భవన్‌లో ఏపీ పాలరైతు సంఘం, విశాఖ డెయిరీ పరిధి ఆరు జిల్లాల పాల రైతుల సంఘం ప్రతినిధుల సమావేశం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం పాలరైతులకు 10 శాతం ధర తగ్గించడం, ఆవు పాల సేకరణపై ప్రకటించిన కొత్త విధానం ఎంతమాత్రం ఉపయోగలేదన్నారు. కేంద్రాల నుంచి 30 లీటర్ల కంటే తక్కువ పాలు సేకరించడం నిలుపుదల చేయడం నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. డెయిరీకి వస్తున్న రూ.కోట్లు దారి మళ్లించి నష్టాలు చూపిస్తున్నారని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు జగనన్న భరోసా

బాధిత కుటుంబానికి బీమా నగదు అందజేత

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకునేందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారని, అధికారం లేదని ఏ ఒక్కరూ అధైర్య పడొద్దని జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అన్నపురెడ్డి హర్షవర్ధన్ తెలిపారు. రేవుపోలవరం వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ సర్పంచ్ చోడిపల్లి రమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన పార్టీ గృహ సారధిగా ఉండటంతో బీమా నగదు రూ.5 లక్షలు మంజూరైంది. ఈ మొత్తం మృతుడు రమణ భార్య లక్ష్మి బ్యాంకు ఖాతాలో జమ కావడంతో ధ్రువీకర పత్రం శుక్రవారం అందజేశారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ గృహ సారధులకే కాకుండా ఇకపై సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు ఓటరుకు ఇటువంటి బీమా సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వేధింపులు ఎక్కువయ్యాయని, వాటికి భయపడవద్దని భరోసా ఇచ్చారు. ఇప్పటికే జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తల్లో ఉత్సాహం నింపేలా 2.0 ఫార్ములా చెప్పారన్నారు. త్వరలో నియోజకవర్గాల వారీగా పర్యటించి ప్రతి ఒక్కరినీ కలుస్తారన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కంబాల జోగులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి కూటమి నేతలు గద్దెనెక్కారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందన్నారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. ప్రజలు ఆశపడి ఓటు వేసినందుకు సిగ్గుపడుతున్నారన్నారు. అమ్మఒడి, రైతు భరోసా వంటి కీలమైన పథకాలు అందక చాలా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్‌లు దూళి శ్రీనివాసరావు, మల్లే లోవరాజు, చోడిపల్లి అనూరాధ, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పన్న, నాయకులు మధువర్మ, గనగళ్ల రాజేష్, జామి అప్పలాజు, పాలుమూరి అప్పలరాజు, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ సూరకాసుల గోవిందు, నియోజకవర్గ కన్వీనర్ బుల్లిదొర, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ చేపల రాజు పాల్గొన్నారు.


మృతుడు భార్యకు బీమా ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న హర్షవర్ధన్, కంబాల జోగులు

ఘనంగా గూడుపమ్మ ఆలయ ప్రారంభోత్సవం


గూడుపమ్మ అమ్మవారు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

నక్కపల్లి: మండలంలో రేబాకలో పునర్నిర్మించిన గూడుపమ్మతల్లి ఆలయం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. వేద పండితులు శ్రీపాద సత్యదేవ శర్మ, తేజ శర్మ, శ్రీపాద ప్రణవ్‌రామ్ తదితరుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు చండీహోమం, అమ్మవారికి విశేష కుంకుమ పూజలు చేశారు. జీర్ణోద్ధరణకు గురైన ఆలయాన్ని ఇటీవల దాతల సహకారంతో కోటి రూపాయలు వెచ్చింది పునర్నిర్మించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది మహిళా భక్తులు అమ్మవారికి సారె సమర్పించి దర్శనం చేసుకున్నారు. పాయకరావుపేట శ్రీప్రకాష్ కళాశాల వారి ఆధ్వర్యంలో 5 వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రీప్రకాష్ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. అమ్మవారిని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, టీడీపీ నాయకుడు కొప్పిశెట్టి వెంకటేష్, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, కోసూరు శ్రీను మీగడ సత్తిబాబు, సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ కాసు బాబు, సూరాకాసుల గోవిందు తదితరులు దర్శించుకున్నారు.

తిమ్మరాజుపేట రామాలయంలో హోమాలు


రామాలయం ఆవరణలో హోమం నిర్వహిస్తున్న భక్తులు


కలశ పూజ చేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట రామాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు, ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. శనివారం ఇక్కడ ఆలయ ప్రారంభోత్సవంతోపాటు సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు వెలవెలపల్లి కోటేశ్వరశర్మ మంత్రోచ్ఛరణల మధ్య వేడుకగా నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధనకు ఏర్పాట్లు చేశామన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

యలమంచిలిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన


పట్టణంలో ప్రధాన రహదారిపై మానవహారం చేస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కీచక ఉపాధ్యాయుడ్ని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం యలమంచిలిలో విద్యార్థులు నిరసన తెలియజేశారు. రాష్ట్రంలో, జిల్లాలో రోజురోజుకూ మైనర్లపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పరిస్థితులను చక్కదిద్దాలని కోరుతూ విద్యార్థులు ప్రధాన రహదారిపై ర్యాలీ, మానవహారం చేపట్టారు. దీనికి నేతృత్వం వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం అభిషేక్, జల్ల శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంతో పాటు మైనర్లపై లైంగిక దాడులు, వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయడం, నిందితులకు చట్టపరంగా త్వరితగతిన కఠినంగా శిక్షలు పడేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మైనర్లు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడాలంటే భయం ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి పరిస్థితులు, వరుస ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ నేతలు కృప, రాజేష్, సింహాద్రి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి


సుంకరమెట్ట జంక్షన్ వద్ద బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, రోడ్డు ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవాలని డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకుని స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద బైక్ ర్యాలీని శుక్రవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్లయితే రోడ్డు ప్రమాదాల ను నిర్మూలించవచ్చన్నారు. అంతకు ముందు సుంక రమెట్ట జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి చేపట్టిన బైక్ ర్యాలీ పట్టణ పురవీధుల్లో సాగింది.

క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరం లేదు


రామన్నపాలెంలో మానవహారంగా ఏర్పడ్డ మహిళలు

అచ్యుతాపురం: క్యాన్సర్ మహమ్మారి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మహిళలకు అనేక రకాలుగా వచ్చే అవకాశం ఉందని వైద్యులు లిఖిత, శ్రావ్యలు తెలిపారు. మండలంలోని రామన్నపాలెంలో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్ సోకే కారణాలు, పర్యవసనాలు, లక్షణాల గురించి వివరించారు. ఆరోగ్య అలవాట్లు, వ్యాయామంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏమాత్రం క్యాన్సర్ సంబంధిత లక్షణాలు కనిపించినా, వెంటనే స్థానిక వైద్యాలయంలో సంప్రదిస్తే పరీక్షలు నిర్వహించి తద్వారా వైద్య సేవలందిస్తామని తెలిపారు. ప్రస్తుతం క్యాన్సర్‌ను చూసి భయపడాల్సిన అవసరం లేదని, మొదటి, రెండు, మూడు దశలుగా వర్గీకరించి వైద్యం అందుతుందన్నారు. మొదటి దశలో గుర్తిస్తే మాత్రలతోనే నయం అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్యాన్సర్‌పై ఇటీవల కాలంలో చాలా చైతన్యం, అవగాహన వచ్చిందని తెలిపారు. హెల్త్ ప్రొవైడర్ భవానీ, ఏఎన్ఎం రమణమ్మ, ఆశా కార్యకర్త సరోజిని తదితరులు పాల్గొన్నారు.